క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



కేసముద్రం: కేసముద్రం మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా టి.రాజేశ్వర్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

దోర్నకల్: వినాయక నిమజ్జన సమయంలో విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ డీఈ విజయ్ కోరారు. స్థానిక యాదవనగర్‌లోని వినాయక మండపాల వద్ద బుధవారం విద్యుత్ ప్రమాదాలపై నిర్వహించిన సదస్సులో డీఈ మాట్లాడారు. వినాయక విగ్రహాల ఊరేగింపులో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నిమజ్జన సమయంలో విద్యుత్ వైర్లకు చిన్నపిల్లలను దూరంగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో డీఈ(టెక్నికల్) హీరాలాల్, ఏఈ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

డీఈఓకు శుభాకాంక్షలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఈఓ పి.దక్షిణామూర్తిని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిర్యాల సతీష్‌రెడ్డి, చాగర్లమూడి శ్రీధర్, సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు హల్యా నాయక్, ఏఐఎఫ్‌టీఓ జాతీయ ఉపాధ్యక్షురాలు గీత, బాధ్యులు పాల్గొన్నారు.

చిన్నగూడూరు: మండల కేంద్రానికి చెందిన సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త శ్రీనివాసులు, జిల్లా బాధ్యులు డీఈఓను మర్యాదపూర్వకంగా కలిశారు.

అసిస్టెంట్ కోచ్‌గా అంజయ్య



మహబూబాబాద్ రూరల్: ఆల్ ఇండియా 69వ పోలీస్ డ్యూటీ మీట్‌కు అసిస్టెంట్ కోచ్‌గా ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ (బాంబ్ స్క్వాడ్) పోలీసు కానిస్టేబుల్ కొంపెల్లి అంజయ్య ఎంపికయ్యారు. కాగా, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌ను పీసీ అంజయ్య బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. ఎస్పీ ఆయనను అభినందించారు. మహారాష్ట్ర రాష్ట్రంలోని పుణేలో అక్టోబర్‌లో ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్ జరుగనుంది.

అప్పయ్యకు డాక్టరేట్

కేసముద్రం: హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన ఎనల్ల అప్పయ్యకు, భారతీయ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, అండ్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ అనంతపూర్ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ నాగజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు.

పురస్కారం ప్రదానం

తొర్రూరు: వైద్య రంగంలో చేసిన విశేష సేవలకుగాను తొర్రూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పగిడిపాటి సుగుణాకర్‌రాజుకు అరుదైన గౌరవం దక్కింది. రాజస్తాన్‌కు చెందిన జీవన్ ఆశీష్ సమితి 'చిరంజీవి ప్రతిభా సమ్మాన్' పురస్కారాన్ని అందించింది.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్ : ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్పోర్ట్స్ స్కూల్ ఏటూరునాగారంలో ఐదో తరగతిలో ప్రవేశాల కోసం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ములుగు జిల్లా ఆర్సీఓ హరిసింగ్ బుధవారం తెలిపారు. విద్యార్థుల దేహదారుఢ్య, నైపుణ్య పరీక్షల ఎంపికలు 8, 9వ తేదీల్లో నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ నాలుగో తరగతి పాస్ సర్టిఫికెట్లు, ఆధార్, జనన, కుల, ఆదాయ, నివాసం సర్టిఫికెట్లతో ఈ నెల 8వ తేదీన ఉదయం 8 గంటలకు ఏటూరునాగారం స్పోర్ట్స్ స్కూల్‌కు హాజరుకావాలన్నారు. వివరాలకు 94416 19409, 94494 48157, 80964 84759, 986668 50347 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

మూలనపడిన ఫాగింగ్ మిషన్లు

● గ్రామాల్లో దోమల స్వైర విహారం



నిరుపయోగంగా ఫాగింగ్ యంత్రం

చిన్నగూడూరు: మండలంలోని గ్రామ పంచాయతీల్లో దోమల నివారణకు కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రాలు మూలనపడ్డాయి. వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో నీరు నిల్వ ఉండడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేసిన ఫాగింగ్ మిషన్లు నిధుల కొరతతో మరమ్మతు చేపట్టక అవి నిరుపయోగంగా మారాయి. దీంతో గ్రామాల్లో దోమల స్వైరవిహారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిధులు లేక మరమ్మతుకు నోచుకోక..

గ్రామాల్లో సర్పంచుల పాలన ముగియడంతో రెండు గ్రామాలకు ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించారు. వారికి విధులు నిర్వహించడం, అదనపు బాధ్యతలు అప్పగించడంతో చాలా వరకు జీపీలకు వెళ్లిన పాపానపోలేదు. మండలంలో 11 గ్రామపంచాతీలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేసింది. గ్రామపంచాయతీల్లో నిధులు కొరతతో ఫాగింగ్ యంత్రాలు మరమ్మతులు నోచుకోక మూలనపడ్డాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గ్రామాల్లో రోడ్లపై, కాలనీల్లో నీరు నిల్వ ఉంటుంది. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలను అందుబాటులో తేవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య, దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. జీపీల్లో నిధుల కొరతతో ఫాగింగ్ మిషన్లకు మరమ్మతులు చేపట్టలేదు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, ఫాగింగ్ మిషన్లకు మరమ్మతులు చేసేలా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాను.
- కిన్నెర యాకయ్య, ఎంపీడీఓ

ఎస్టీ జాబితానుంచి తొలగించే కుట్ర

● ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భీమానాయక్



నెహ్రూసెంటర్: అభివాదం చేస్తున్న సంఘం నాయకులు

నెహ్రూసెంటర్: తెలంగాణలో లంబాడీల ఓట్లతో గెలిచి లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేలా కుట్రలు చేస్తున్నారని ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి హరినాయక్, రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘ రాష్ట్ర స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు లంబాడీలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో వాసునాయక్, బిచ్చనాయక్, రాందాస్‌నాయక్, మంగిలాల్, రాంజీ, శ్రీను పాల్గొన్నారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని కుట్రలు చేస్తూ కేసులు వేస్తున్నారని, లంబాడీల జోలికి వస్తే ఊరుకోమని ఎల్‌హెచ్‌పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ బోడ లక్ష్మణ్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు ఆంగోత్ చందులాల్ అన్నారు.

రాజకీయ లబ్ధి కోసం చిచ్చుపెట్టొద్దు

బయ్యారం: రాష్ట్రంలో కలిసి మెలిసి జీవిస్తున్న ఆదివాసీ, లంబాడీల మధ్య కొందరు తమ రాజకీయ లబ్ధికోసం చిచ్చుపెట్టే ప్రయత్నం చేయొద్దని లంబాడీ జేఏసీ నాయకులు శ్రీకాంత్, రవి, శ్రీను అన్నారు. బుధవారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్న తెల్లం వెంకట్రావ్, సోయం బాపురావులు ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని సుప్రీంకోర్టులో పిటీషన్ వేయటం సరికాదన్నారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు సునీల్, దేవోజీ, రాజు, లచ్చిరాం, దేవ్‌కుమార్, రమేష్, మోహన్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలి

● మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

గార్ల: రాష్ట్రంలో త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో గెలుపొంది పార్టీ సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో రైతులకు యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని బీసీలను మభ్యపెడుతుందన్నారు. ఈనెల 10, 11 తేదీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చేపట్టిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనలో నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, రమేష్, రాధాకృష్ణ, ఖదీర్, భాస్కర్‌రావు, మురళీ, ఉత్తరయ్య పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ రాందాస్ బీఆర్‌ఎస్‌లో చేరారు.

సరిపడా యూరియా అందించాలి



నెల్లికుదురు: సరిపడా యూరియా అందించకుండా ఎన్నిరోజులు ఇలా పడిగాపులు కాస్తు ఇబ్బందులు పడాలని అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా నాయకుడు ఆలకుంట్ల సాయన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రైతులతో కలిసి రోడ్డెక్కి రాస్తారోకోకు దిగారు.

యూరియాపై పట్టింపేది?

పెద్దవంగర: రైతులు యూరియా కోసం అరిగోస పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం పటించుకోవడం లేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. బుధవారం మండలంలోని రెడ్డికుంట తండ, రామచంద్రు తండా, బంగారు చెలిమి తండాల్లో గ్రామ కమిటీల ముఖ్య సమావేశం చేపట్టారు. కార్యక్రమంలో వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ, సునీల్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్లు చోరీ

చిన్నగూడూరు: నెలన్నర వ్యవధిలోనే ఓ రైతుకు చెందిన రెండు వ్యవసాయ మోటార్లు చోరీ జరిగాయి. ఈ సంఘటన మండల కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత రైతు గంగాధరి రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రం శివారు సబ్‌స్టేషన్ సమీపంలోని తన వ్యవసాయ బావికి అమర్చిన విద్యుత్ మోటార్ జులై 17న చోరీ జరిగిందన్నారు. పంట పొలాలకు నష్టం కలగకుండా తెలిసిన వారి వద్ద నుంచి రూ.30వేలు అప్పు తెచ్చి బావికి మరో మోటార్ అమర్చాడు. సెప్టెంబర్ 1న గుర్తు తెలియని వ్యక్తులు రెండోసారి మోటార్ అపహరించినట్లు బాధితుడు బోరున విలపిస్తూ తెలిపాడు. రెండు మోటార్ల విలువ సుమారు రూ.60వేలు ఉంటుందన్నాడు. ఈ విషయమై మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు పేర్కొన్నాడు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

● ఎంపీ బలరాంనాయక్



గూడరు: బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీ

గూడూరు: అసంపూర్తిగా నిలిచిన బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీ పోరిక బలరాంనాయక్ ఆర్‌అండ్‌బీ ఈఈ, ఏఈ, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మండలంలోని భూపతిపేట శివారు కొత్తగూడ మండలంలోని గుంజేడు జాతర వెళ్లే మార్గంలో బ్రిడ్జి అసంపూర్తిగా ఉండడంతో.. ఆటోలు, ట్రాక్టర్లు, కార్లు ప్రమాదానికి గురవుతున్నాయి. కాగా ఎంపీ బుధవారం అటువైపుగా వెళ్లారు. కాంగ్రెస్ మండల నాయకులు కట్ల విష్ణు గౌడ్, మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్ సమస్యను ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా బ్రిడ్జిని పరిశీలించారు. వెంటనే ఆర్ అండ్ బీ అధికారులకు ఫోన్‌లో పరిస్థితిని చెప్పి, వెంటనే పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మాధవపెద్ది అమరేందర్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, శివ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

కొత్తగూడ: గుంజేడు ముసలమ్మ ఆయల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ బలరాం నాయక్ హామీ ఇచ్చారు. బుధవారం ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చల్ల నారాయణరెడ్డి, వజ్జ సారయ్య, రణధీర్, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఉద్యమ శక్తులు ఒకే గొడుగు కిందకు రావాలి



మాట్లాడుతున్న జేవీ చలపతిరావు

నెహ్రూసెంటర్: ప్రజా ఉద్యమశక్తులైన కమ్యూనిస్టులందరూ ఒకే గొడుగు కిందకు వచ్చి దేశంలో జరుగుతున్న దోపిడీ, మోదీ ఫాసిస్టు విధానాలపై పోరాటాలు నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధులు జేవీ చలపతిరావు, సాధినేని వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని భట్టు అంజయ్య భవన్‌లో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో బూర్జువ, దోపిడీ పార్టీలను ఓడించేందుకు పోరాడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరి మధు, కె.గోవర్ధన్, నాయకులు గౌని ఐలయ్య, మండల వెంకన్న, హెచ్ లింగ్యా, గుజ్జు దేవేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు వత్తాసు పలుకుతున్న పోలీసులు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో నెలకొన్న సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తే కలెక్టర్ కార్యాలయంలోకి అనుమతించకపోవడం, తిరిగి మాపై అక్రమ కేసులు పెట్టి కాంగ్రెస్ నాయకులకు పోలీసులు వత్తాసు పలకడం స్పష్టంగా కనిపిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ప్రధాని మోదీ తల్లిని విమర్శించడం సరికాదన్నారు. టౌన్ సీఐ, ఎస్సైల తీరు మార్చుకోవాలన్నారు. జిల్లాలో బీజేపీ నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్యామ్ సుందర్‌శర్మ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గద్దం అశోక్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షురాలు ఓర్సు పద్మ, ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రాంబాబు నాయక్, జిల్లా కార్యదర్శి దార ఇందు భారతి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పూజలు.. అన్నదానాలు



కేసముద్రం: అమీనాపురంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీనాయక్, తదితరులు



మహబూబాబాద్ రూరల్: లక్ష్మిగణపతి యజ్ఞం చేస్తున్న భక్తులు



బయ్యారంలోని గాంధీసెంటర్‌లో అన్నదానం..



గార్ల: కోలాటం ఆడుతున్న మహిళలు

గణపతి మండపాల వద్ద వినాయకుడికి 8వరోజు బుధవారం పూజలు కొనసాగాయి. అనంతరం దాతలు అన్నదాన వితరణ చేశారు. పలు చోట్ల గణేశుడి విగ్రహాలను ఊరేగించి, చెరువుల్లో నిమజ్జనం చేశారు.
- సాక్షి నెట్‌వర్క్

అవయవ దానంపై అవగాహన



మహబూబాబాద్: అవగాహన కల్పిస్తున్న క్లబ్ మానుకోట శాఖ సభ్యులు

మహబూబాబాద్: అవయవదానంపై విస్తృతంగా ప్రచారం చేసి చైతన్య పరుస్తున్నామని లయన్స్ క్లబ్ మానుకోట శాఖ అధ్యక్షుడు డాక్టర్ వీరన్న అన్నారు. బుధవారం రక్తదాన పక్షోత్సవాలలో భాగంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో రక్త, నేత్ర, అవయవ పార్థీవ దేహాలదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కాలనీకి చెందిన ఎడ్ల శ్రీనివాస్ తన మరణానంతరం తన పార్థీవదేహాన్ని మెడికల్‌కాలేజీకి అందజేయడానికి ముందుకు వచ్చి అంగీకార పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పర్కాల రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఎడ్ల రమేష్, వేణు, జనార్దన్, మహిపాల్‌రెడ్డి, వీరారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

నేత్రదానం చేయాలి

బయ్యారం: చనిపోయిన వ్యక్తి నేత్రాలు దానం చేయడం ద్వారా బతికున్న మరొకరి కంటికి వెలుగును ఇవ్వొచ్చని తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు పరికిపండ్ల అశోక్ అన్నారు. ఆగష్టు 25నుంచి సెప్టెంబర్ 8వరకు నిర్వహిస్తున్న నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం బయ్యారంలో ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

దోర్నకల్: వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని తహసీల్దార్ ఇమ్మానియల్ తెలిపారు. బుధవారం స్థానిక పెద్ద చెరువు వద్ద విగ్రహాలను నిమజ్జనం చేసే ప్రదేశాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్, ఆర్ఐ యాసీన్‌పాషా, సుమేర్‌చంద్‌జైన్ పాల్గొన్నారు.

చెక్కు అందజేత



గార్ల: గార్లకు చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ జంజిరాల భాస్కర్ భార్య సావిత్రి ఇటీవల మృతి చెందింది. దీంతో బుధవారం మృతురాలి భర్తకు సంఘం అధ్యక్షుడు ఎస్‌కె హుస్సేన్ రూ.1,60,000 చెక్కును బుధవారం అందజేశారు. కార్యక్రమంలో తోట సుభాష్, లక్ష్మణ్, సందీప్ బాబూరావు, ఎస్‌కె ఫక్రుద్దీన్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

పెద్దవంగర: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకొని సత్తా చాటాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. బుధవారం మండలంలోని పోచంపల్లి గ్రామంలో నాయకుడు మదన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీటీసీ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మురళీ, సైదులు, సతీష్, హరికృష్ణ, పూర్ణచందర్, గోపాల్, సోమన్న పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో దరఖాస్తులకు ఆహ్వానం

కురవి: మండల కేంద్రంలోని సిద్దార్థ హైస్కూల్ ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లో టెన్త్, ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బుధవారం ప్రిన్సిపాల్ అల్వాల కార్తీక్ తెలిపారు. ఈనెల 7వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తులు చేసుకునే వారు 98852 14380 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

యూరియా అందేలా చర్యలు

కురవి: ప్రతీ రైతుకు యూరియా అందే విధంగా చర్యలు తీసుకుంటామని ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం సీరోలు మండలం కాంపల్లి సొసైటీలో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ సురేష్, సొసైటీ సీఈఓ శ్రీమాన్, నాయకులు పాల్గొన్నారు.

42శాతం రిజర్వేషన్‌తో బీసీలకు న్యాయం

తొర్రూరు: స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలుతో బీసీలకు రాజకీయంగా న్యాయం చేకూరుతుందని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్ అన్నారు. డివిజన్ కేంద్రంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కంచర్ల వెంకటాచారి, పింగిళి ఉష, చెవిటి సధాకర్, తాళ్లపల్లి బిక్షంగౌడ్, ప్రతికంఠం దేవేందర్‌రాజు సోమిరెడ్డి పాల్గొన్నారు.

అడవి పందిదాడిలో ఒకరికి గాయాలు

గంగారం: అడవి పంది దాడిలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని అందులోగూడెం గ్రామ శివారులోని వ్యవసాయ భూముల వద్ద బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గంగారం మండలంలోని అందులోగూడెం గ్రామానికి చెందిన రైతు కుంజ ప్రభాకర్ మొక్కజొన్న చేనులో యూరియా చల్లుతుండగా ఒక్కసారిగా అడవి పంది దాడిచేసింది. చేతికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లికుదురు: గ్రామపంచాయతీ వర్కర్ల సమస్యలు పరిష్కరించి, వారి గోస పట్టించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాడ్ చేశారు. ఈమేరకు ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ సింగారపు కుమార్‌కు వర్కర్లతో కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో వర్కర్లు బొల్లం ఎల్లయ్య, రామకోటి, బాలాజీ, రఘు పాల్గొన్నారు.

రైలు కిందపడి ఆత్మహత్య

కేసముద్రం: రైలు కిందపడి ఓ గుర్తు తెలియని దివ్యాంగుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కేసముద్రం రైల్వేస్టేషన్‌లో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం రైల్వేస్టేషన్‌లో 40–45 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి(దివ్యాంగుడు) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చనిపోయిన వ్యక్తికి ఒక కాలు లేకపోవడంతో రెండు చేతికర్రల సాయంతో నడుస్తున్నట్లు గుర్తించారు. మృతుడి కుడి చేతిపై అమ్మ అనే పచ్చబొట్టు, ఎడమ చేతిపై లవ్ సింబల్ ఉంది. వైట్ కలర్ షర్ట్, బ్లాక్ కలర్ పాయింట్, చామనచాయ రంగు ఉన్నట్లు తెలిపారు. మృత దేహన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు ఆయన తెలిపారు

వెంటాడుతున్న యూరియా కష్టాలు



దోర్నకల్ పీఏసీఎస్ ఎదుట రైతుల క్యూ..



కురవి: క్యూలో రైతులు



గార్లలో ..




దంతాలపల్లి: కూపన్లకోసం రైతుల క్యూ..



మహబూబాబాద్ రూరల్: సొసైటీ వద్ద రైతుల క్యూ..

రైతులను యూరియా కష్టాలు వెన్నంటే వెంటాడుతున్నాయి. సొసైటీకి బుధవారం యూరియా వస్తుందోనని రైతులు తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాశారు. కొన్నిచోట్ల యూరియా పంపిణీ చేశారు. కొన్నిచోట్ల యూరియా రాలేదని తెలిసిన రైతులు ఇంటికి వెనుదిరిగారు.
- సాక్షి నెట్‌వర్క్

విధులపై ఇంత నిర్లక్ష్యమా?



మాట్లాడుతున్న పీడీ మధుసూదన్‌రావు

కొత్తగూడ: విధులపై ఇంత నిర్లక్ష్యం అయితే ఎలా అంటూ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఏపీఓ, టీఏ, ఎఫ్ఏలపై డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. ప్రజావేదికలో ఏపీఓ ఏమీ పట్టనట్లు సెల్‌ఫోన్ చూస్తుండటంతో పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ పథకం మాది కాదు అన్నట్లు వ్యవహరిస్తున్నారని సరికాదని హెచ్చరించారు. హరితహారంలో నాటిన మొక్కలు భారీగా చనిపోవడం ఏంటని ప్రశ్నించారు. మండలంలో మొత్తం రూ.1,95,550ల రికవరీ విధించారు. ప్రజావేదికలో రాష్ట్ర ఉపాధి హామీ సంస్థ సభ్యుడు చల్లనారాయణరెడ్డి, డీవీసీ మన్‌మోహన్‌రెడ్డి, విజిలెన్స్ ఆదాం, ఎంపీడీఓ రోజారాణి పాల్గొన్నారు.

శ్మశానవాటికలో అస్థికలు మాయం

మహబూబాబాద్ రూరల్: మృతిచెందిన వ్యక్తికి అంత్యక్రియలు నిర్వహించిన అనంతరం నదిలో కలపాల్సిన అస్థికలు మాయమైన సంఘటన జిల్లా కేంద్రంలోని బయ్యారం రోడ్డులో గల లయన్స్ క్లబ్ శ్మశానవాటికలో చోటుచేసుకుంది. విద్యుత్ శాఖలో లైన్‌మన్‌గా విధులు నిర్వహించే పడాల శ్రీనివాస్ 10రోజుల క్రితం మృతిచెందాడు. జిల్లా కేంద్రంలోని బయ్యారం రోడ్డులో గల శ్మశానవాటికలో కుటుంబ సభ్యులు దహన సంస్కారాలు నిర్వహించారు. బుధవారం కుటుంబ సభ్యులు అస్థికలు (చితాభస్మం) కోసం శ్మశానవాటికకు రాగా అస్థికలు కనిపించ లేదు. దీంతో కుటుంబానికి ఏదో కీడు జరుగుతుందని భయ భ్రాంతులకు గురవుతున్నారు. గతంలో కూడా ఈ శ్మశానవాటికలో క్షుద్ర పూజలతో పేరుతో చితాభస్మాలు మాయమైన సంఘటనలు చోటుచేసుకున్నాయని స్థానికులు ఆరోపించారు.